క్లుప్తంగా

పాఠశాల రికార్డుల సీజ్

కమలాపూర్ : మండలంలోని భీంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పని చేస్తున్న విజయ హెచ్‌ఎంతో పాటు తోటి ఉపాధ్యాయులపై దురుసుగా ప్రవర్తిచండంతో పాటు అటెండెన్స్ రిజిష్టర్‌లో వైటెనర్‌ను ఉపయోగిస్తూ సీఎల్‌లను ఓసీఎల్‌గా, ఓసీఎల్‌లను సీఎల్‌గా మార్చుకుంటోందని, పాఠశాలకు హాజరైన రోజుల కంటే ఎక్కువ వేతనం పొందారని టీపీటీఎఫ్ నాయకులు ఇటీవల డీఈఓ అబ్దుల్ హైకి ఫిర్యాదు చేశారు. డీఈఓ ఆదేశాల మేరకు ఎంఈఓ రాంకిషన్‌రాజు పాఠశాలలో సోమవారం విచారణ చేపట్టారు. విచారణకు సంబంధిత ఉపాధ్యాయురాలు విజయ గైర్హాజరు కావడంతో పాఠశాలలోని రికార్డులను సీజ్ చేసి ఉప్పల్ స్కూల్ కాంప్లెక్స్‌లో భద్రపరిచినట్లు ఎంఈఓ తెలిపారు. తదుపరి విచారణ మంగళవారం చేపట్టి నివేదికను డీఈఓకు అందజేయనున్నట్లు ఎంఈఓ పేర్కొన్నారు.

మల్లు రవిని కలిసిన నాయకులు

ఐనవోలు : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమితుడైన డాక్టర్ మల్లు రవిని సోమవారం మండలంలోని పంథిని గ్రామానికి చెందిన బండి సుధాకర్‌గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మల్లు రవికి పూలబొకే అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ పట్ల నిబద్ధతే వారిని ఈ స్థాయికి చేర్చిందని సుధాకర్ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు, కార్యకర్తలకు మల్లు రవి ప్రస్థానం ఎంతో స్ఫూర్తినిస్తుందని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా ఈనెల 23న హనుమకొండ, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి, వరంగల్ టౌన్‌డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. హనుమకొండలోని బాలసముద్రం ప్రాంతంలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు. వరంగల్‌లోని కృష్ణాకాలనీ, స్టేషన్‌రోడ్, వరంగల్ చౌరస్తా, రాంకీ, గ్రెయిన్ మార్కెట్, దయానంద కాలనీ, లక్ష్మీపురం, రంగశాయిపేట, మహాలక్ష్మి దేవాలయం, గొల్లవాడ, కుమ్మరివాడ, నాయుడు పెట్రోల్ పంపు, గణపతి ఇంజనీరింగ్ కళాశాల, పెరకవాడ, ఎస్ఆర్ఆర్ తోట, బీరన్నకుంట, మామునూరు, కుమ్మరిపల్లి, వెటర్నరీ కళాశాల, రంగంపేట, బట్టలబజార్, ఓఎస్‌నగర్, పాపయ్యపేట చమన్, దేశాయిపేట, బాలాజీనగర్, నజరత్‌పుర, కొత్తవాడ, డాక్టర్స్ కాలనీ, బ్యాంక్ కాలనీ, మర్రి వెంకటయ్య కాలనీ, రాంనాథ్‌పురై, ఫిల్టర్‌బెడ్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ కోత విధించనున్నట్లు వారు వేర్వేరు ప్రకటనలో వివరించారు.

శంకర్‌కు డాక్టరేట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఇంగ్లిష్ విభాగం పరిశోధకుడు దేవసోత్ శంకర్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. అమితావ్ ఘోష్ సెలెక్ట్ ఫిక్షన్ : ఏ స్టడీ ఇన్ హిస్టారికల్ పర్‌స్పెక్టివ్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి దేవసోత్ శంకర్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మేఘనరావు పర్యవేక్షణలో శంకర్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

వేతనాల పెంపునకు కృషి చేయాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో దినసరి వేతనం, లంప్సమ్, క్యాజువల్ ఉద్యోగులకు వేతనాల పెంపునకు సంబంధించిన జీఓ 60 అమలయ్యేలా కృషి చేయాలని కాకతీయ యూనివర్సిటీ దినసరి వేతన, తాత్కాలిక ఉద్యోగుల సంఘాల బాధ్యులు కోరారు. ఈమేరకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే, కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్‌ను కూడా కలిసి పెంచిన వేతనాలు అమలయ్యేలా చూడాలని సూచించారు. ఉద్యోగ సంఘాల బాధ్యులు దయాకర్, శివప్రసాద్, సంగాల రాజమౌళి, సురేష్, డాక్టర్ శాగంటి శ్రీనివాస్, సంతోష్, గోపి, సుధాకర్, కుమార్ పాల్గొన్నారు.

కేయూకు నిధులు కేటాయించాలి

కేయూ క్యాంపస్: ప్రభుత్వ వార్షిక రాష్ట్ర బడ్జెట్‌లో కాకతీయ యూనివర్సిటీకి నిధులు పెంచి బడ్జెట్‌లో కేటాయింపులు ఉండేలా కృషి చేయాలని ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్, అధ్యాపకుడు డాక్టర్ తిరుణహరి శేషు, బాధ్యులు కోరారు. ఈమేరకు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కుమారస్వామి, డాక్టర్ రమేష్, డాక్టర్ రాంబాబు, డాక్టర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు పంపించాలి

వరంగల్: తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని వరంగల్ ఏంఈఓ విజయ్‌కుమార్ సూచించారు. ఔట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్ కార్యక్రమంలో భాగంగా చిన్నచిన్న కారణాలతో పాఠశాలకు వెళ్లకుండా ఇంట్లో ఉంటున్న ఓ విద్యార్థిని ఏంఈఓ గుర్తించి జీహెచ్‌ఎస్ గిర్మాజీపేట స్కూల్‌లో సోమవారం చేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడీడు పిల్లలందరు బడికి పోవాలని సూచించారు.


ఐనవోలు : హాజరైన మహిళా భక్తులు


ఆత్మకూరు : రేవూరిని సన్మానిస్తున్న ట్రస్టు సభ్యులు


కమలాపూర్ : కల్యాణం జరిపిస్తున్న అర్చకులు


పరకాల : అయోధ్య రామాలయ ఆకృతి ముగ్గు వేస్తున్న మహిళలు

ఊరూరా మార్మోగిన 'శ్రీరామ' నామస్మరణ

- జిల్లా వ్యాప్తంగా భక్తుల పూజలు, అన్నదానం
- మంగళహారతులు, డీజేసౌండ్లతో సందడి
- కమలాపూర్‌లో కలశాలతో ఆలయాలకు చేరుకున్న నార్త్ ఇండియన్స్
- పూజల్లో పాల్గొన్న ప్రముఖులు


దామెర : డిస్నీల్యాండ్ పాఠశాలలో..


పరకాల : సీతారాముల కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులు


ఎల్కతుర్తి : శ్రీరాముడు, లక్ష్మణుడి వేషధారణలో..

ఎల్కతుర్తి : అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠాపనను పురస్కరించుకొని ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల్లో సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు శ్రీరాముడి శోభాయాత్రను వైభవోపేతంగా నిర్వహించారు. బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్రలో నాయకులు పెద్దెత్తున పాల్గొని డీజే సౌండ్ల నడుమ మహిళలు కోలాటాలు ఆడుతూ శోభాయాత్ర కొనసాగించారు. భక్తులు స్వామివారికి మంగళహారతులు అందించి నారికేళములు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఓరామ.. శ్రీరామ.. జయ జయ రామ.. అనే నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. ముల్కనూరులో నిర్వహించిన శోభాయాత్రలో చిన్నారుల రాముడు, లక్ష్మణుడు వేషధారణలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ ఆలయాల్లో ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కమలాపూర్ : కమలాపూర్, ఉప్పల్, భీంపల్లి, శనిగరంతో పాటు పలు గ్రామాల్లో బాలరాముడి ప్రాణప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకుని అయోధ్య శ్రీరామ తీర్థ క్షేత్ర కమిటీలు, శ్రీరామ, హనుమన్ భక్త మండళ్ల ఆధ్వర్యంలో సోమవారం శ్రీరాముడి చిత్రపటం, సీతారామలక్ష్మణుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం రామాలయాల వద్ద ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్ల వద్ద బాలరాముడి ప్రాణప్రతిష్ఠాపన మహోత్సవాన్ని భక్తులు కనులారా తిలకించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. బాలరాముడి ప్రాణప్రతిష్ఠాపన సందర్భంగా రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్ రాష్ట్రాల నుంచి (నార్త్ ఇండియన్స్) జీవనోపాధి కోసం కమలాపూర్‌కు వలస వచ్చిన వారంతా రంగులు చల్లుకొని నృత్యాలు చేయగా మహిళలు నెత్తిన కలశాలు ఎత్తుకొని శోభాయాత్రగా రామాలయానికి చేరుకుని సీతారామ, లక్ష్మణులకు ప్రత్యేక పూజలు నిర్వహించి కలశాభిషేకాలు చేశారు. ఉప్పల్ రామాలయంలో రాత్రి దీపోత్సవం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా సీఐ బి.సంజీవ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ధర్మసాగర్ : అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా మండల కేంద్రంలో సీతారాముల పల్లకి సేవ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి భక్తులు శ్రీవేణుగోపాలస్వామి ఆలయం నుంచి ఆంజనేయస్వామి ఆలయం వరకు పల్లకిలో సీతారాముల విగ్రహాలతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర చేపట్టారు. అనంతరం ఆంజనేయస్వామి భక్తులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు నర్సింహాచారి, భాస్కరాచారి(భాను), భగవాన్ ప్రత్యేక పూజలు చేశారు.

శాయంపేట : అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా మండలంతో పాటు మత్స్యగిరి స్వామి, వేంకటేశ్వరస్వామి, శివమార్కండేయస్వామి, పత్తిపాకలోని సంజీవ ఆంజనేయస్వామి, ప్రగతిసింగారం, మైలారం, తహరాపూర్ గ్రామాల్లోని రామాలయాల్లో, కొప్పులలోని హనుమాన్ ఆలయంలో, గట్లకానిపర్తి శివాలయంలో, పెద్దకోడెపాక గ్రామంలోని రాజేరాజేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీమత్స్యగిరిస్వామి ఆలయంలో శ్రీసీతారామచంద్రస్వామి ఉత్సవ విగ్రహాలకు పంచామృత అభిషేకం చేసి సామూహిక హోమం నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీమత్స్యగిరిస్వామి ఆలయంలో ప్రముఖ న్యాయవాది లెక్కల జలెందర్‌రెడ్డి, పత్తిపాక గ్రామంలోని సంజీవఆంజనేయ ఆలయంలో సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి ఎల్ఈడీ స్కీన్‌లు ఏర్పాటు చేసి అయోధ్య రామమందిరంలో బాలరాముని ప్రాణప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించారు.

వేలేరు : అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా మండలంలోని రామాలయాలను, ఆంజనేయస్వామి ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించి, కాషాయ జెండాలతో ముస్తాబు చేశారు. సీతారాముల విగ్రహాలకు భక్తులు పూజలు, అభిషేకాలు, అర్చనలు, చందనం వేసి కల్యాణం జరిపించారు. అనంతరం దాతల సహకారంతో గ్రామాల్లో అన్నదానం చేపట్టారు.

దామెర: అయోధ్యలో శ్రీరాముడి ఆలయ ప్రాణప్రతిష్ఠాపనను పురస్కరించుకొని సోమవారం మండలంలోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో భక్తులు టెంకాయలు సమర్పించారు. భజన కార్యక్రమం పలువురిని ఆకట్టుకుంది. సర్పంచ్ శ్రీరాంరెడ్డి, ఎంపీటీసీ కృపాకర్‌రెడ్డి, వార్డుసభ్యులు పాల్గొన్నారు. అలాగే ఊరుగొండలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం అంగరంగవైభవంగా నిర్వహించారు. ల్యాదెల్ల, కోగిల్వాయి, పులుకుర్తి, పసరగొండ, సీతారాంపూర్, ముస్త్యాలపల్లి, తక్కళ్లపహడ్ గ్రామాల్లోని ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఓగ్లాపూర్ సమీపంలోని డిస్నీల్యాండ్ పాఠశాలలో విద్యార్థులు జై శ్రీరాం ఆకృతిలో ప్రదర్శన నిర్వహించి, నినాదాలు చేశారు.

ఆత్మకూరు : మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో అయోధ్యలో జరిగిన బాలరాముడి ప్రాణప్రతిష్ఠాపనను పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. గ్రామాల్లో స్క్రీన్లు ఏర్పాటు చేసి అయోధ్య ప్రసారాన్ని వీక్షించి తన్మయత్వం పొందారు. మండల కేంద్రంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థ క్షేత్ర ట్రస్టు బాధ్యులు సత్యనారాయణ, బుచ్చిరెడ్డి, శివప్రసాద్, శంకర్, విజయ్, సర్పంచ్ రాజు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. అర్చకులు కేశవ మూర్తి, మాధవ మూర్తి ప్రత్యేక పూజలు చేపట్టారు. సీఐ రవిరాజు, ఎస్సై ప్రసాద్, రాజేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పరకాల : అయోధ్య బాలరాముడి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠాపన సందర్భంగా ఊరు ఊరునా..వాడ వాడన శోభాయాత్రలు, ప్రత్యేక పూజలతో ఆలయాల్లో సందడి నెలకొంది. శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు పరకాల శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని అయ్యప్ప దేవాలయం నుంచి పోచమ్మ గుడి వరకు శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, హనుమంతుడు వంటి వేషదారణలతో భక్తులు శోభయాత్ర నిర్వహించారు. శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానం, శ్రీచెన్నకేశవస్వామి ఆలయాల నుంచి రథయాత్రలు నిర్వహించగా కోలాటం నృత్యాల ఆకట్టుకున్నాయి. స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

ఐనవోలు : అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠాపనను పురస్కరించుకుని మండలంలోని కక్కిరాలపల్లి శ్రీలక్ష్మీనృసింహ ఆలయంలో సోమవారం అర్చకుల ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో కొలువై ఉన్న శ్రీరామ, సీత, లక్ష్మణ, ఆంజనేయుల ఉత్సవ విగ్రహాలకు అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపించారు. రవి ఆచార్యులు రాముడి గొప్పతనం, విశిష్టత గురించి భక్తులకు ప్రవచనం చేశారు. మహిళలు సామూహిక మంగళహారతి సమర్పణ చేయగా అర్చకుడు నక్షత్రహారతి సమర్పించారు. అర్చకుడు జయకృష్ణ, ఆలయ చైర్మన్ సత్యనారాయణ, డైరక్టర్ మోహన్, వెంకటేశ్వర్‌రావు, లక్ష్మణ్‌రావు, కిషన్, రాము, వంశీ, అరుణ్, యుగంధర్, దేవేందర్, వేణు, శ్రీనివాస్, కౌశిక్, రాజు, శ్రీనివాస్, మహిళ భక్తులు రాణి, యాదలక్ష్మి పాల్గొన్నారు.


దామెర: పూజలు నిర్వహిస్తున్న భక్తులు


వేలేరు : సీతారాముల కల్యాణంలో..


శాయంపేటలో శోభాయాత్ర..


ధర్మసాగర్ : శోభాయాత్రలో భక్తులు


కమలాపూర్ : కోలాటం ఆడుతున్న మహిళలు

అంగన్‌వాడీ సిబ్బంది సమయపాలన పాటించాలి

దామెర : అంగన్‌వాడీ సిబ్బంది సమయపాలన పాటించాలని ఐసీడీఎస్ సీడీపీఓ భాగ్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రంతో పాటువ ఊరుగొండ సెక్టార్లల్లోని 32 మంది అంగన్‌వాడీ హెల్పర్లతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఐసీడీఎస్ సేవలు అందించడంలో అంగన్‌వాడీ టీచర్లతో పాటు హెల్పర్లు కీలకమని అన్నారు. వ్యక్తగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ వంటలు చేయాలని సూచించారు. పిల్లల అలన, పాలన చూసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని అన్నారు. శాఖాపరమైన మార్పులను ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. దామెర సెక్టార్ సూపర్‌వైజర్ జంగం రాణి, ఊరుగొండ సెక్టార్ ఇంచార్జ్ సూపర్‌వైజర్ మంజుల, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీడీపీఓ భాగ్యలక్ష్మి

'దళితబంధు' నిధులు విడుదల చేయాలి

దామెర : దళితబంధు నిధులను వెంటనే విడుదల చేయాలని దళితబంధు పథకం మండల కోఆర్డినేటర్ గరిగె కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాక్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 97 మంది లబ్ధిదారులను దళితబంధు పథకానికి ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. ఎంపికైన లబ్ధిదారుల ఖాతాల్లో వెంటనే డబ్బులు జమచేసి యూనిట్లను విడుదల చేయాలని పేర్కొన్నారు. ఎంపీపీ కాగితాల శంకర్, బీఆర్‌ఎస్ నాయకులు జన్ను మల్లయ్య, చిలువేరు రాజు, జన్ను విద్యాసాగర్, దళితబంధు లబ్ధిదారులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

కమలాపూర్ : మండలంలోని ప్రజలకు 108, 102 వాహన సిబ్బంది అందుబాటులో ఉంటూ సేవలందించాలని హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ లక్ష్మణ్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణంలో ఉన్న 108, 102 అంబులెన్స్‌లను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మానిటర్, ఏఈడీ, సెక్షన్ ఆపరేటర్, బీపీ ఆపరేటర్, గ్లూకోమీటర్ తదితర పరికరాల పనితీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇంజక్షన్లు, మందుల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈఎంటీ శ్రీనివాస్, పైలట్ కేదారి, 102 కెప్టెన్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


అంబులెన్స్‌ను తనిఖీ చేస్తున్న లక్ష్మణ్

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

ఆత్మకూరు : పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు, అక్కంపేట జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు శ్రీధర్‌రావు ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. ఈమేరకు పీఆర్‌టీయూ నూతనంగా ప్రవేశ పెట్టిన క్రియాశీలక సభ్యత్వం ద్వారా లక్ష రూపాయలు చెక్కు మంజూరు అయింది. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీహరి, ఆత్మకూరు మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి ఉన్నారు.


చెక్కు అందజేస్తున్న సంఘం సభ్యులు

కారు, బైక్ ఢీ

వేలేరు : ఎదురెదురుగా వస్తున్న కారు, బైక్ ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన వేలేరు గురుకుల పాఠశాల సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేలేరు మండల కేంద్రానికి చెందిన మఠం శ్రీశైలం తన కూతురు శిరీషతో కలిసి హనుమకొండ నుంచి వేలేరుకు బైక్‌పై వస్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను బలంగా ఢీ కొట్టింది.ఈ ప్రమాదంలో బైక్‌పై నుంచి కిందపడిన శ్రీశైలం, ఆయన కూతురు శిరీషకు గాయాలయ్యాయి. బైక్ నుజ్జునుజ్జయింది. గమనించిన స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో 108 సిబ్బంది మెరుగైన చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు


గాయపడిన యువకులు

ఎల్కతుర్తి : ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఇద్దరు వ్యక్తులు గాయాలపాలయ్యారు. ఈ సంఘటన సోమవారం సాయంత్రం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్కతుర్తి మండలం దామెర గ్రామానికి చెందిన ఎండీ రియాజ్, అల్లకుంట ప్రవీణ్ ద్విచక్ర వాహనం (పల్సర్)పై వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు బైక్‌పై అదుపుతప్పి రోడ్డుపై పడింది. దీంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది.

పిచ్చికుక్క బాబోయ్..



దామెర : మండల కేంద్రంలో ఓ కుక్క స్వైరవిహారం చేస్తు పులువురిని గాయపరుస్తున్న విషయం తెలిసిందే. కాగా సోమవారం మరో వ్యక్తిని గాయపరిచింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మాదారపు రవి ఇంటి సమీపంలో పనులు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో కుక్క ఒక్కసారిగా దాడిచేసింది. దీంతో స్థానికులు అరుపులు వేయడంతో పరుగెత్తింది. కాగా రవి తలకు, నుదురుపై తీవ్ర గాయాలు కాగా వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో కుక్క చేస్తున్న దాడులపై గ్రామ పంచాయతీ పాలకులు స్పందించడం లేదంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుక్క దాడి చేస్తుందనే భయంతో బయటికెళ్లాలంటే హడలిపోయే పరిస్థితి దాపురించిందని వాపోయారు.

మహాసభలను జయప్రదం చేయాలి

కమలాపూర్ : ఫిబ్రవరి 11, 12వ తేదీల్లో ఖమ్మంలో నిర్వహించే విద్యా, వైజ్ఞానిక మహాసభలకు ఉపాధ్యాయులు, మేధావులు, విద్యాభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి కోరారు. ఈమేరకు మండలంలోని భీంపల్లి జెడ్పీ హైస్కూల్‌లో టీపీటీఎఫ్ ద్వితీయ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక మహాసభల వాల్‌పోస్టర్లను ఎంఈఓ రాంకిషన్‌రాజు చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడారు. విద్య ప్రజల హక్కు, ప్రభుత్వ బాధ్యత అనే ప్రధానాంశంగా మహాసభలు నిర్వహిస్తున్నామని అన్నారు. సమానత్వ విద్య, ఫాసిజమ్ బుద్ధి జీవుల పాత్ర, మహిళల స్థితిగతులు, కర్తవ్యం, ప్రభుత్వ విధానాలు, ఆర్థిక సంక్షోభం అనే అంశాలపై ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ కాశీం, బుర్ర రమేష్, ఎ.నరసింహారెడ్డి, చందన చక్రవర్తి, వేణుగోపాల్ ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి సీతక్క, తుమ్మల నాగేశ్వర్‌రావు హాజరు కానున్నట్లు తెలిపారు. సర్పంచ్ జవ్వాజి పద్మ, హెచ్‌ఎంలు కె.రవి, రఘుపతి, ఎస్‌ఎంసీ చైర్మన్ రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మహాసభల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంఈఓ

ఉపాధిహామీ పనులను సక్రమంగా చేపట్టాలి

ఐనవోలు : ఉపాధిహామీ పనులను సక్రమంగా చేపట్టి ప్రతీ కూలీకి పని కల్పించాలని అడిషనల్ డీఆర్‌డీఓ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పంథిని, కక్కిరాలపల్లి, పెరుమాండ్లగూడెం, ఐనవోలు గ్రామాలను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశాలను సందర్శించి కూలీలతో మాట్లాడారు. ఎన్ని గంటలకు వస్తున్నారు.. ఎంత కూలీ వస్తుందని అడిగి తెలుసుకున్నారు. కనీసం ఏడు గంటలు పని చేయాలని, కొలతల ప్రకారం పనిచేస్తే రూ.272 వస్తాయని తెలిపారు. నర్సరీలను కూడా సందర్శించిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి గ్రామంలో కనీసం 50 మంది కూలీలు పని చేసేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. ఎవరైతే కూలీలకు పనులు కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారో వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అడిషనల్ డీఆర్‌డీఓ హోదాలో తొలిసారిగా మండలానికి వచ్చిన శ్రీనివాస్‌ను సర్పంచ్‌లు మర్యాద పూర్వకంగా శాలువాలతో సత్కరించారు. ఏపీఓ నక్క కుమారస్వామి, సర్పంచ్‌లు ప్రేమలత, రజిత పాల్గొన్నారు.


కూలీలతో మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీఓ